నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు నంద్యాల
శనివారం 11 అక్టోబరు 2025
పేజీలు 8





## ఇద్దరు విద్యార్థులను
# చితకబాదిన టీచర్

➲ గాయాలపాలైన విద్యార్థులు

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను టీచర్ సురేష్ చితకబాదడంతో వీపుకు తీవ్ర గాయాలయ్యాయి. తరగతి గదిలో అల్లరి చేస్తున్నారని ఆగ్రహానికి లోనైన టీచర్ అదుపు తప్పి ఆగ్రహం కోల్పోయి విచక్షణా రహితంగా చితకబాదాడు. గురువారం పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకొంది. వివరాల మేరకు పత్తికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జశ్వంత్, వంశీ, ఆరవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను ఆ పాఠశాలలో లెక్కల పాఠాలు చేబుతున్న టీచర్ సురేష్ క్లాసులో అల్లరి చేస్తున్నారన్న నేపంతో ఆగ్రహానికి లోనై ఆవేశ పూరితంగా వీపులకు చితకబాదడంతో విద్యార్థులకు తీవ్రంగా గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు పాలైన విద్యార్థులు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో శుక్రవారం బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. లెక్కల టీచర్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు

మిగతా 2లో





విద్యార్థుల వీపుకు గాయాలైన దృశ్యాలు

- కెఎంసి ఖజానాకు గండి..కొందరి జేబుల్లోకి రూ.కోట్లు
- లేని ఉద్యోగులను చూపించి సొమ్ములు కాజేస్తున్న కార్పొరేషన్
- ఆయనకు అండగా నిలుస్తున్న కొందరు అధికారులు
- అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన నగరపాలక సంస్థ

# జేబులు నింపుతున్న ‘చెత్త’

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** చెత్త చెత్త కాదు..చెత్తను రీసైకిలింగ్ చేస్తే ఆదాయమే ఆదాయమంటూ ఒకప్పుడు నగరపాలక సంస్థ ఊదరగొట్టేది. అయితే అది ఇప్పుడు కొందరి జేబులు నింపుతోంది. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పేరుతో అదనంగా కార్మికులు అవసరమనే సాకుతో రికార్డుల్లో కార్మికులను చూపించి వారి జీతాలను కొందరు భోంచేస్తున్నారు. కర్నూలు పట్టణాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టి.జి.భరత్ నిరంతరం పడుతున్న తపన కొందరికి కాసులు కురిపిస్తోంది.కెఎంసి ఖజానాకు గండి కొడుతోంది.

మిగతా 2లో






## కూటమి ప్రభుత్వానికి మెడికల్ కళాశాలల
# అభివృద్ధి పట్టలేదు..!

-మెడికల్ కళాశాల ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ
-వైసీపీ రీజినల్ కో..ఆర్డీనేటర్,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

2లో



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

# కార్యకర్తలే పార్టీకి బలమైన పునాదులు

- 24 వరకు రచ్చబండ..కోటి సంతకాల సేకరణ
- వైసీపీ నేతల పిలుపు

2లో



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

## ‘నమో’సభకు
# లక్షలాదిగా తరలిరండి

- ప్రతిష్టాత్మకంగా సభ
- జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఆదాయం పెరిగింది
- తెదేపా నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఈ నెల 16వ తేదీన కర్నూలు శివార్లలోని రాగయమూరి గ్రీన్‌హిల్స్‌లో నిర్వహించబోయే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగసభకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి లక్షలాదిగా తరలిరావాలని తెదేపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బిటి నాయుడు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కెడిసిసి బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్ పిలుపునిచ్చారు.శుక్రవారం జిల్లా తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, కెవి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెదేపా నేతలు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి కర్నూలు జిల్లాకు వస్తున్న భారత ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయడం ద్వారా జీఎస్టీ సంస్కరణలతో

మిగతా 2లో



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

## అధ్వాన్నస్థితిలో
# పాఠశాల మరుగుదొడ్లు

- లోపించిన నిర్వహణ, పర్యవేక్షణ
- పొంతన లేని కారణాలు చూపుతున్న హెడ్‌మాస్టర్
- కనపడని డిఈఓ,డిప్యూటీ డిఈఓ పర్యవేక్షణ తనిఖీలు
- శిథిలావస్థకు చేరుకున్న గమనించలేని హెడ్‌మాస్టర్
- ముప్పుగా మారిన విద్యార్థుల ఆరోగ్యం

6లో




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

## ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను
# పకడ్బందీగా చేయండి

- ఏర్పాట్లను పరిశీలించిన ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్, కలెక్టర్, మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు

6లో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

**G. PULLA REDDY ENGINEERING COLLEGE (Autonomous) : KURNOOL–518007**
Accredited by NBA and NAAC
Estd : 1985 Ph : 08518-270957

**I B.Tech - APEAPCET - 2025 - SPOT ADMISSIONS**

A few seats are vacant in I B.Tech. under Spot Admissions. Eligible and interested candidates may appear for Spot Admissions on or before **13.10.2025** in the college office along with original certificates.

These admissions will be made as per the guidelines issued by the Convener, APEAPCET-2025 and subject to ratification by the competent authority. Candidates admitted in Spot Admissions are not eligible for Fee Reimbursement. - SECRETARY

# ఇద్దరు విద్యార్థులను చితకబాదిన టీచర్

(మొదటి పేజి తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ టీచర్ పాఠశాలలో విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుంటారని గతంలో కూడ ఇలాంటి సంఘటనలు జరిగాయని ఏ కారణం చేతైనా చేయి చేసుకుంటూ కొడుతుంటారని పాఠశాలలో విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులును అడ్డగా ఎన్నో పిరియడ్‌లో జరిగిందో ఎప్పుడు జరిగిందో విషయం తెలియదని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పడంతో విషయం తెలిసిందన్నారు. పాఠశాలలో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన ప్రధానోపాధ్యాయురాలుకు విషయం తెలియకపోవడం గమనార్హం.

# 'నమో' సభకు లక్షలాదిగా తరలిరండి

(మొదటి పేజి తరువాయి)

ధరల తగ్గింపుకు అవకాశమిచ్చిన ఆయనకు కృతజ్ఞతలు ప్రకటించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు మోదీ నుండి పొందవచ్చని వారు చెప్పారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు నిధులు మంజూరు చేయించుకునే విషయంపై దృష్టి సారిస్తున్నామని వారు చెప్పారు. ఓర్వకల్లుకు పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇక్కడి యువతకు ఉద్యోగాలు లభిస్తాయని వారు చెప్పారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేయండి

**– వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రైవేట్ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సీతారామిరెడ్డి పిలుపునిచ్చారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని భీమ నిలయంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం... కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం, విద్యార్థుల పట్ల చెలగాటమాడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బెట్టన్న గౌడ్, దేశాయి, ప్రహ్లాద్ స్వామి, ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జేబులు నింపుతున్న 'చెత్త'

(మొదటి పేజి తరువాయి)

అవినీతికి కేరాఫ్‌గా మారిన కెఎంసిలో 'చెత్త' కథ బాగానే నడుస్తోంది. రాజకీయ నాయకులకు, మునిసిపాలిటీలోని కొందరు అధికారులకు ఇదే చెత్త వరాలు కురిపిస్తోంది. దీనిపై 'సూర్య' దినపత్రిక కథనం చదవండి.

వైకాపా ప్రభుత్వం ఇంటి నుండి చెత్త సేకరించే పేరుతో యూజర్ ఛార్జీలు వసూలు చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చాక దాన్ని తొలగించింది. దీంతో ఇంటింటి నుండి చెత్త సేకరణకు అవసరమైన మేర మానవ వనరులు లేకపోవడంతో జోక్యం చేసుకున్న మంత్రి టి.జి.భరత్ అదనంగా 200 మంది పారిశుద్ధ్య కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకునేలా ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకున్నారు. కార్మికులకు ఒక్కొక్కరికి రూ.12వేలు చొప్పున వేతన ఒప్పందం జరిగింది. కార్మికుల ఏర్పాటు కాంట్రాక్టును తెదేపాకు చెందిన ఓ కార్పొరేటర్‌తో అప్పటి కమీషనర్ రవీంద్రబాబు కాంట్రాక్టు ఒప్పందం చేశారు. ఈ కార్మికులకు అటెండెన్స్, వేలి ముద్ర లేదా ఐరిష్ విధానం అమలు చేయడం లేదు. ఇదే కొందరికి కాసుల పంట పండిస్తోంది. దీన్ని ఆధారంగా చేసుకున్న తెదేపా కార్పొరేటర్ 200మంది కార్మికులను ఏర్పాటు చేయకుండా కేవలం 70-80మందిని ఏర్పాటు చేసి అంతా పని చేస్తున్నట్లు పారిశుద్ధ్య అధికారికి చూపిస్తూ బిల్లులు మంజూరు చేయించుకుని నెలకు రూ.కోటి వరకు దండుకుంటున్నారని తెలుస్తోంది. ఇందులో తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా శానిటరీ సూపర్‌వైజర్, హెల్త్ అధికారి, ఇంజనీరింగ్ అధికారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, మేస్త్రీలు, సచివాలయ వెల్ఫేర్ అధికారికి కూడా భాగం ఉండడంతో ఈ విషయం బయటకు పొక్కకుండా ఎవరికి వారు అందినకాడికి దోచుకుంటున్నారు. నగరంలో 16శానిటరీ డివిజన్లుండగా ఒక్కో డివిజన్‌లోని పార్కులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక్కో డివిజన్‌కు 10మంది చొప్పున కేటాయించాల్సి ఉంది. అలాంటిదేమీ జరుగకుండా కేవలం 80మందిని మాత్రమే ఏర్పాటు చేసి గత 6నెలలుగా 200మందికి బిల్లులు శాంక్షన్ చేసుకుంటున్నారు. డిప్యూటేషన్‌పై కెఎంసికి హెల్త్ అధికారిగా వచ్చిన వ్యక్తి మూడో ఏడు కూడా ఇక్కడే కొనసాగి దోపిడీకి అండదండలు అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవలే ఆయన ఇక్కడి నుండి బదిలీ అయ్యారు. ఒక రాజకీయనేత అండదండతోనే ఆయన మూడేళ్లు ఇక్కడే కొనసాగారన్నది కెఎంసిలో గుసగుసలుగా చెప్పుకుంటూ ఉంటారు.

నడిరోడ్డుపై చెత్త ఉన్నా కనపడడం లేదా నగరాన్ని చెత్త నగరంగా మార్చారని గత కలెక్టర్ కమీషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తే కేవలం ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను మాత్రమే సస్పెండ్ చేసి వదిలేశారు. చెత్త సేకరణలో రెండేళ్ల క్రితం స్వచ్ఛాంధ్రలో కర్నూలు జిల్లా 2వ స్థానంలో ఉండగా ప్రస్తుతం ఎక్కడికో వెళ్లింది. దీనిని పట్టించుకునే నాథుడే లేడు. దీంతో కర్నూలు నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లు, మేస్త్రీలు, అధికారుల అవినీతితో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# కూటమి ప్రభుత్వానికి మెడికల్ కళాశాలల అభివృద్ధి పట్టలేదు..!



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



స్వాగతం పలుకుతున్న వైసిపి మహిళా నాయకురాళ్లు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వానికి మెడికల్ కళాశాలల అభివృద్ధి పట్టలేదని వైసిపి రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సంస్థాగత సమావేశానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, నగర మేయర్ బివై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్‌లు బుట్టా రేణుక, శ్రీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలను కాపాడుకునేందుకు కోటి సంతకాల సేకరణను వైసిపి పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి కార్యకర్త గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేదల నుండి వైద్యంలో దోచుకునేందుకు బాబు కుట్రలు చేస్తున్నారని, ఈ కుట్రను వైసిపి పార్టీ ఎదుర్కొని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకర్తలకు పెద్దపీట వేసి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు క్రియాశీలకంగా బాధ్యతలు ఇస్తామని ఆయన తెలిపారు. అనంతరం కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నంద్యాల వైసిపి జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీ స్థాయి నుంచి వైసిపి బలోపేతం దిశగా వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. ఈసారి వైసిపి అధికారంలోకి వచ్చాక కార్యకర్తల ద్వారానే పాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలమైన పునాదులు



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి వివిధ స్థాయిలలో విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నారని వైసీపీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి సంస్థాగత సమావేశం వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన రీజనల్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేటి నుంచి నవంబర్ 24వ తేదీ వరకు గ్రామస్థాయి నుంచి రచ్చబండ కార్యక్రమాలు కోటి సంతకాల సేకరణను చేపట్టే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. దివంగత మాజీ సీఎం వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రీజనల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రవిచంద్రకిశోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, జిల్లా పార్లమెంటరీ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నందికొట్కూరు వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ దార సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ వైయస్సార్‌సీపీ పార్టీని బలోపేతం చేసేందుకు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జిల్లాస్థాయి సంస్థాగత సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కమిటీలను, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమైన పునాదులని వారే సర్వం అని తెలిపారు. కమిటీల ఏర్పాటు ద్వారా కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని పార్టీ సైనికుల్లా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్‌సీపీ పార్టీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని ఈమేరకు నేటి నుంచి నవంబర్ 24వ తేదీ వరకు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేసిన అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. 17నెలల కాలంలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని ఎక్కడ చూసినా దుర్మార్గాలు, అరాచకాలు, అత్యాచారాలు, అకృత్యాలు, హత్యలు, అక్రమ కేసులతో దుర్మార్గంగా వ్యవహరిస్తూ కూటమి ప్రభుత్వం దుష్టపాలనను చేస్తున్నదని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికలలోల ప్రజలకు బూటకపు వాగ్దానాలను చేసి సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారం చేపట్టారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించి కల్తీ మద్యాన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందన్నారు. 2029లో జరిగే ఎన్నికలలో వైసీపీ పార్టీ విజయం సాధించేందుకు తమ శాయాశక్తులా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, నాగిరెడ్డి, గోపవరం సాయినాథ్‌రెడ్డి, రామలింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పీపీ మధుసూధన్‌రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మాబున్నీసా,డాక్టర్‌శశికళారెడ్డి, పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నేతలు

## ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి రూ.5 లక్షలు చెక్కు పంపిణీ



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల మండల పరిధిలోని వెంకటగిరి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లస్వామి గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చెక్కును శుక్రవారం టిడిపి కార్యాలయంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఫజుల్ రహిమాన్ ఏపీఓ విజయరాణి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## శనగ విత్తనాలు పంపిణీ

**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలంలోరబిసీజన్‌కు సంబంధించిన శనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. హాలహర్వి మండలమునకు 2500 క్వింటాలు మంజూరు కాగా. ఒక క్వింటం శనగ పూర్తి ధర 7800 ఉండగా సబ్సిడీ 1950 రైతు వాటా 5850 రూపాయలు చెల్లించాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్ తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆత్మ మధుమోహన్, హాలహర్వి మరియు మాచనూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.




శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

## శెట్టివీడు గ్రామ సర్పంచ్ రాజీనామా

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలం లోని శెట్టివీడు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎర్రోళ్ళ లక్ష్మీదేవి తమ సర్పంచ్ పదవికి రాజీనామా చేసారు. చాగలమర్రి పట్టణం లోని మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ తాహీర్‌హుసేన్‌కు తన రాజీనామా లేఖను శుక్రవారం అందజేసారు. తన వ్యక్తిగత కారణాల వల్ల తన సర్పంచ్ పదవికి రాజీనామా చేసినట్లు లక్ష్మీదేవి తెలిపారు. ఉన్నతాధికారులు తన రాజీనామాను ఆమోదించాలని ఆమె కోరారు.



రాజీనామా లేఖను ఎంపీడీఓకు అందజేస్తున్న సర్పంచ్

## బైరెడ్డి అభిమాని మృతికి నంద్యాల ఎంపి శబరి నివాళులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధి లోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వీరాభిమాని, తెదేపా ముఖ్య కార్యకర్త ఎం మురళీధర్ రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి మురళీధర్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీధర్‌రెడ్డి మృతి బాధాకరమని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపి సానుభూతిని తెలియజేశారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపి బైరెడ్డి శబరి

## చీటీ డబ్బులు కట్టనందుకు వ్యక్తిపై కత్తితో దాడి

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని వన్ టౌన్ పరిధిలో షేక్ ఆదిల్ అనే వ్యక్తి చీటీలు ఎత్తుకుని డబ్బులు కట్టనందుకు ఉస్మానియా కాలేజీ వద్ద గొడవకు దిగి ఆదిల్‌పై వన్ టౌన్ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి 11.30గంటలకు షేక్ ఆదిల్ రూ.50వేలు చీటీలు రెండు ఎత్తుకుని డబ్బులు కట్టనందున ముగ్గురు వ్యక్తులు ఇంటికి అడగడానికి వెళ్లి గొడవపడి ఆదిల్‌ను చిన్న కత్తితో అతని కుడివైపు పొట్టలో పొడవడంతో గాయాలపాలయ్యాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు బాధితుడు, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## రైతులు సబ్సిడీ శనగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం సబ్సిడీపై అందించే శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి రైతులను కోరారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏఓ మధుమతి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్సిడీపై రైతులకు అందించే శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ వెంకట రమణయ్య, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, హుసేనాపురం సింగిల్‌విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఓర్వకల్ సింగిల్‌విండో చైర్మన్ సుధాకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



## గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు పశు వైద్యులను సంప్రదించాలని చాగలమర్రి పట్టణ ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జ్ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. మండలంలోని చింతలచెరువులో పశు గణాభివ ద్ధి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు గర్భకోశ చికిత్స వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు దీపాకుమారి,పుల్లయ్య, సాయిబాబాలు పశువుల్లో ఎదకు రాని, తిరగ కట్టే 43 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేస్తుందని, రైతులు వాటిని వినియోగించుకోవాలన్నారు. పాడి రైతులకు లింగ నిర్ధారణ వీర్యం వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమం లో పశువైద్య సిబ్బంది షాజీబాష,మురళి కృష్ణ, మహబూబ్‌బాష,ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఏడీ

## పాడి పశువుల ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తి ప్రభుత్వ లక్ష్యం

**-పాడి రైతుల ఆదాయం రెండింతలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం: సర్పంచ్ ప్రసాద్**

**పాములపాడు,మేజర్‌న్యూస్ :** రాష్ట్రీయ గోకుల మిషన్ పథకంలో భాగంగా పాములపాడు మండలంలోని తుమ్మలూరు గ్రామంలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసాద్ , ఎంపీటీసీ మరియు నాయకులు వెంకటేశ్వర రెడ్డి, సత్తిరెడ్డి రైతు సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 మంది రైతులకు చెందిన 9 ఆవులు 47 గేదెలు పరీక్షించి,70 దూడలకు నట్టల నివారణ మందులు త్రాపడం జరిగిందని,37 సాధారణ కేసులకు చికిత్స అందించడమైనదని వారు తెలిపారు. పెయ్యదూడలు మాత్రం పొందేందుకు సెక్స్ సార్టెడ్ సెమెన్ ,కోళ్లకు ప్రతి గురువారం కొక్కెర తెగులు వ్యాధి నిరోధక టీకాలు , జూనోటిక్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం జరిగిందని,నట్టల నివారణ,వ్యాక్సినేషన్ ప్రాముఖ్యత ,మినీ గోకులాలు, ఉపాధి హామీ పథకం ద్వారా , పశు గ్రాస పెంపకం,కేసిసి లోన్స్ పై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. డా రవి శంకర్ ,డా సాయిలీల డా. అశోక్ పశువులను పరీక్షించడం చేసి చికిత్స అందించారు. వెటర్నరీ అసిస్టెంట్‌శ్వేత,ఏ హెచ్ ఏలుకవిత,తిరుమలేష్, ప్రసన్న ,చాందిని, శ్వేత, పూజిత ,గోపాల మిత్ర లు మున్వర్ భాష, భాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




## కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం..

**దేవనకొండ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి పాలన అస్తవ్యస్తంగా మారిందని వారికి బుద్ధి చెప్పేందుకే వైకాపా అధినేత కోటి సంతకాలతో ప్రజా ఉధ్యమం చేపడుతున్నట్లు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. మెడికల్ కాలేజీలను పిపిపి విధానాన్ని రద్దు చేయాలని శుక్రవారం టర్నింగ్ నందు కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను మండల కన్వీనర్ కిట్టుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయి కుంగి పోతున్నారని ఆవేధనను వ్యక్తం చేశారు. పాలనపై వ్యతిరేకిస్తున్న సామాన్య ప్రజలను అణచివేస్తున్నారని ఇదేనా వారు చెబుతున్న కూటమి పాలన విధానం అని ప్రశ్నించారు .సామాన్య పేద విధ్యార్థులకు డాక్టర్ చదవాలన్న కోరికల్ని కూటమి ప్రభుత్వం అంతమొందించాలనే ఉద్దేశ్యంతోనే మెడికల్ కాలేజీలకు పిపిపి విధానం ప్రవేశ పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికలలో ప్రజల తిరుగుబాటును చూస్తారని హెచ్చరించారు. రాష్ట్ర యువజన విభాగం సెక్రెటరి చంద్రశేఖర్,మండల నాయకులు దివాకర్ నాయుడు,లుముంబా,నారాయణ రెడ్డి పాల్గొన్నారు.



పోస్టరలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

## వివాహానికి ఆర్ధిక సహాయం అందించిన ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సభ్యులు



వివాహానికి వస్తువులను అందజేస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని ఈద్గా నగర్‌కు చెందిన పఠాన్ మాబూ ఖాన్ కుమార్తె వివాహానికి ఫ్రెండ్సె బ్లడ్ గ్రూప్ సభ్యులు రూ. 15వేల రూపాయల విలువ చేసే వస్తువులను వారికి అందించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సభ్యులు షాషావలి మాట్లాడుతూ గడిచిన 5 సంవత్సరాల కాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందని అత్యవసర సమయంలో స్నేహితుల ద్వార రోగులకు అవసరమైన మేరకు రక్తాన్ని అందజేయడం జరిగిందని రక్తదాన శిబిరాలను బనగానపల్లె పట్టణంలో ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు మారు పేరుగా ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ మారిందని అన్నారు. తాను అడిగిన వెంటనే సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్జి కుర్రాడు అత్తార్ అన్ను, జాకీర్, జావిద్, నసృద్దీన్, చిరు, నారాయణ, ఫకృద్దీన్, సూర్య, రామకృష్ణ, చరన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలో అధికారులతో ప్రత్యేక సందేశం నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16న మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిల్లాకు వస్తున్న సందర్భంలో మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రధానమంత్రి పర్యటనకు తరలి వెళ్లాలని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ సూచించారు. మండలానికి96 బస్సులను ప్రభుత్వం కేటాయించిందని అందుకు కార్యకర్తలు నాయకులు ప్రధానమంత్రి పర్యటనకు తరలివెళ్లి విజయవంతం చేయాలని ఎంపీడీవో రాణెమ్మసూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు,సచివాలయ సిబ్బంది,వెలుగు సిబ్బంది, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఈడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :**

ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న బిఈడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీ నందు విసి వెంకట బసవరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మహేంద్రబాబు మాట్లాడుతూ ఆర్‌యూ పరిధిలో బిఈడి కళాశాల యాజమాన్యం కన్వీనర్ కోట అడ్మిషన్స్ కూడా అక్రమంగా రూ.50వేల నుండి రూ.80వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అలాగే యూనివర్సిటీ ప్రొసీడింగ్స్ ఉండాలనే నిబంధనలు ఉన్నా కళాశాలలు మాత్రం పాటించడం లేదన్నారు. అనేక కళాశాలలు ఒకటే భవనంలో 3కళాశాలలు నడుపుతున్న యూనివర్సిటీ ఎలా అనుమతులు ఇస్తారని వారు ప్రశ్నించారు. వెంటనే నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దాదాపు 25కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ, సందీప్, ప్రశాంత్, ప్రకాష్, ప్రమోద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య



# మోడీ సభను విజయవంతం చేయాలి : వేల్పుల గోపాల్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** దేశ ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ పర్యటనను విజయవంతం చేయాలని బిజెపి నాయకులు వేల్పుల గోపాల్ అన్నారు. శుక్రవారం కోడుమూరు అసెంబ్లీ రూరల్ మండల బిజెపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులను ప్రధాని మోడీ ప్రారంభిస్తారన్నారు. 16న ఉదయం మొట్టమొదటిసారిగా శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాములను దర్శించుకుని అనంతరం సాయంత్రం కర్నూలు నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. కావున బిజెపి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు రూరల్ మండల అధ్యక్షులు బెస్త ఈరన్న, రాఘవ ఆచారి, మద్దిలేటి, కృష్ణ, రఘునాథ్ సింగ్, విశ్వనాథ్ రెడ్డి, పవన్ కుమార్, హర్షవర్ధన్ నాయుడు, మహేష్, యల్లప్ప, వెంకటేశ్వర్లు, మహేంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**దేశ ఆర్థిక బలోపేతానికి, అభివృద్ధికి కృషి చేయాలి :** భారతదేశ ఆర్థిక బలోపేతానికి, అభివృద్ధికి దేశ ప్రజలందరు కృషి చేయాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, కోఆర్డినేటర్ కుర్ని వెంకటేశ్వర్లు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సురవరం గీతా మాధురిలు అన్నారు. ఈ నెల 16న ప్రధాని



మాట్లాడుతున్న బిజెపి నాయకులు వేల్పుల గోపాల్

మోడీ కర్నూలు జిల్లా పర్యటకు వస్తున్న సందర్భంగా జనసమీకరణ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ పాల్గొనే ఈ సభకు బిజెపి కార్యకర్తలు, నాయకులు, మేధావులు, వ్యాపారస్తులు, ప్రజలు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆటో మొబైల్ రంగం, ఎలక్ట్రానిక్స్, ఫార్మా మందులు, చేనేత, వ్యవసాయ పనిముట్లపై ప్రధాని మోడీ జిఎస్‌టి తగ్గించి పేద, మధ్య తరగతుల జీవితాల్లో వెలుగులు తెచ్చారన్నారు. జిఎస్‌టిని తగ్గించినందుకు ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు అసెంబ్లీ 2, 3, 4, 5, 6వ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువమోర్చ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమామహేశ్వరుల హుండీ ఆదాయం రూ.20లక్షల46వేలు

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 20లక్షల46వేల31రూపాయలు రావడం జరిగింది. శుక్రవారంనాడు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ పాండు రంగారెడ్డి మరియు ఆలయ తనిఖీ అధికారి హరిచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో 90రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా భక్తులు నగదు రూపంలో స్వామి వారికి సమర్పించింది రూ.20,46,031 రాగా , వెండి 650 గ్రాముల వస్తువులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాగంటిపల్లె మౌళీశ్వర రెడ్డి, రామశేఖర్, భరతుడు, శ్రీరామ సేవా సమితి సభ్యులు ఆలయ అర్చకులు, హెడ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిబ్బంది,



పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# "సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్" అవగాహన కార్యక్రమం

**ఎస్.వి.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోనే అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్.వి.ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ "సూపర్ జీఎస్టీ - సూపర్‌సేవింగ్స్"పై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వస్తు మరియు సేవల పన్ను ( జీఎస్టి )ప్రాముఖ్యత, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం, మరియు సరళీకృత పన్ను విధానాల ద్వారా "సూపర్ సేవింగ్స్" సూత్రం పై అవగాహన కల్పించారు. ఈడిప్యూటీ కమిషనర్ మురళి మోహన్,అసిస్టెంట్ కమిషనర్ ఎన్. లక్ష్మి నాయక్, అసిస్టెంట్ కమిషనర్





ఎన్. చందన హర్ష ప్రతిష్టాత్మక వనరుల వ్యక్తులు తమ అనుభవాన్ని పంచుకున్నారు. వారు జీఎస్టీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో పోషించే పాత్రను వివరించారు. కస్కేడింగ్ టాక్సులను తొలగించడం, అనుసరణను సులభతరం చేయడం, పారదర్శకతను ప్రోత్సహించడం వంటి అంశాలను వివరించారు. జీఎస్టీ భారతదేశ పన్ను వ్యవస్థను ఎలా సులభతరం చేసిందో వివరించారు. అనేక పరోక్ష పన్నులను ఒకే పద్ధతిలో సమీకరించడం ద్వారా పారదర్శకమైన మరియు సమర్థవంతమైన విధానం సాధ్యమైందని చెప్పారు. అలాగే "సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్" భావన ద్వారా వ్యాపారాలకు ఇన్‌పుట్ క్రెడిట్ల సౌలభ్యం లభిస్తుందని, వినియోగదారులకు పన్ను భారాన్ని తగ్గిస్తుందని తెలియజేశారు. విద్యార్థులు పన్ను అవగాహన కలిగి ఉండటం అత్యవసరమని, ఆర్థిక విజ్ఞానం ప్రతి ఒక్కరి వ్యక్తిగత మరియు వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమన్నారు.

# ప్రజలను దోచుకోవడం వైయస్సార్సీపీ నాయకులకు అలవాటు

**-సొసైటీ ఛైర్మెన్ సిద్ధిసత్యనారాయణ**

**దొర్నిపాడు మేజర్ న్యూస్ :** ప్రజలను దోచుకోవడం వైయస్సార్సీపీ నాయకులకు కార్యకర్తలకు అలవాటేనని దొర్నిపాడు వ్యవసాయం సహకార సంఘం చైర్మన్ సిద్ధి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సొసైటీ చైర్మన్ సిద్ధి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ రోజు సాక్షి పేపర్ లో "ఉద్యోగాల పేరుతో ఊడ్చేశారు "మండల టిడిపి నాయకులు అని వ్రాయడం జరిగిందిఅని వార్త రాసేటప్పుడు వాస్తవాలు తెలుసుకొని రాయాలనిఎవరు వైయస్సార్సీపీ, ఎవరు టిడిపి అని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజానిజాలు ప్రజలకు తెలిసేలా వ్రాయాలని తప్పుడు వార్తలు వ్రాసి ప్రజలను తప్పుదోవపట్టిస్తూ నిరంతరం టిడిపి ప్రభుత్వం పైన, టిడిపి నాయకులపైన బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారని గతంలోకూడా ఇదేవిదంగా ప్రభుత్వం పై టిడిపి నాయకుల పైన తప్పుడు వార్తలు రాసారని మరొకసారి ఇలాంటి అసత్య కథనాలు రాస్తే లీగల్ గా చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు అసలు బాచిరెడ్డి విరారెడ్డి వైయస్సార్సీపీ నాయకుడు అని టిడిపి నాయకుడు కాదని ఆయన తెలిపారు ప్రజలు నష్టపోయినది వాస్తవం కానీ అది మీ వైయస్సార్సీపీ నాయకుడు ద్వారానే అనేది సాక్షి విలేకరి తెలుసుకోవాలని రాష్టంలో జరుగుతున్న అభివృద్ధి, నియోజకవర్గంలో జరుగుతున్న



అభివృద్ధి చూడలేక ప్రభుత్వం పైన టిడిపి నాయకులపైన సాక్షి పత్రిక ద్వారా విషం కక్కుతున్నారనిఅయనఅన్నారు. మరొక్కసారి ఇలాంటివి జరగకుండా సాక్షి రిపోర్టర్ చూసుకోవాలని అయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సిద్ధి సత్యనారాయణ టిడిపి నాయకులు పాల్గొన్నారు .

# పార్క్‌కు అదనపు ఆదాయం

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలోని కుందూనది వద్ద పార్క్ లో వాణిజ్య కార్యక్రమం కొరకు, పార్క్ పచ్చదనం, పరిశుభ్రత పెంచి ప్రజల అవసరమైన, నాణ్యమైన సేవలు అందించడానికి శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఈవో ప్రకాశ్ నాయుడు తెలిపారు. ఈ వేలం ద్వారా కోవెలకుంట్ల గ్రామ పంచాయతీకి అధనంగా రూ. 1.25 లక్షలు ఆదాయం వస్తుందని అన్నారు. ఇక్కడికి వచ్చే సందర్శకులకు అవసరమైన భద్రత కొరకు సీసీ కెమెరాలను అమర్చడం జరుగుతుందని, ఈ పార్క్‌ను షేక్ సాహెబ్‌బాష అనే వ్యక్తి వేలంలో దక్కించుకోవడం జరిగిందని అన్నారు.



# పి.ఎం సభను విజయవంతం చేద్దాం

**ఏపీ ఎస్పీడీసీఎల్ ఛైర్మెన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి..**



**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** ఈ నెల 16వ తేదీ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నా సందర్భంగా బహిరంగ సభకు ఉమ్మడి కర్నూలు జిల్లా కూటమి నాయకులు, కార్యకర్తలు అందరం భారీ జన సమీకరణతో బహిరంగ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జీ.ఎస్టీ 2.0 సంస్కరణలు ప్రయోజనాలపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సి.ఎం చంద్రబాబునాయుడుఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని. ఈ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారాచంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవణ్‌కళ్యాణ్‌లు పాల్గొననున్నారని అన్నారు.

# కాశీరెడ్డి నాయన ఆశ్రమానికి కేంద్ర అనుమతులు ఇప్పించాలి



ఎంపి శబరికి వినతిపత్రం అందచేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని అవధూత శ్రీ కాశీరెడ్డి నాయన సమాధి ఆశ్రమానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు మంజూరు చేయాలని అలాగే కర్నూలు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టి వెంటనే జీఓ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిర్రు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి తూముకుంట ప్రతాప్ రెడ్డిలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపి రెడ్డి సంఘం ఆద్వర్యంలో ఎంపి బైరెడ్డి శబరికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు పర్యటనకు వస్తున్న భారత ప్రధాని నరేంద్రమోడీ వివరించి ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు.

# కొనసాగుతున్న పవిత్రోత్సవాలు





**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో పవిత్రోత్సవం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం అహోబిల మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం యాగశాలలో హోమం నిర్వహించారు. పీఠాధిపతి స్వామి సమక్షంలో వేద పండితులు వేద పారాయణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పవిత్ర ఉత్సవ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** నందవరం శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి నంద్యాల జిల్లా మిట్నాల గ్రామ వాస్తవ్యులు సద్దల నాగసుదర్శన్ రెడ్డి వారి ధర్మపత్ని అంజనమ్మ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధికి రూ.25000 రూపాయల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఆలయ అర్చక వేద పండితులకు అందజేశారు. ఆలయ అర్చకులు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

# స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన నోవీ విద్యార్థులు

**తుగ్గలి,మేజర్‌న్యూస్ :** మండల స్థాయిలో జరిగినటువంటి మండల స్థాయి అండర్ 14 గేమ్స్ లో భాగంగా నోవీ హైస్కూల్ తుగ్గలి విద్యార్థులు రామలింగయ్య పల్లిలో శుక్రవారం జరిగినటువంటి పోటీలకు హాజరు కావడం జరిగింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థులు బి శివకేశవ 8వ తరగతి మరియు రామ్ చరణ్ 9తరగతి క్లాస్ వీరు కబడిలో మండల స్థాయికి ఎంపిక కావడం జరిగింది అలాగే పి మల్లికార్జున 8 క్లాస్ ఖో ఖో గేములకు ఎంపిక కావడం జరిగింది. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థులను నోవిఇమ్రాన్ భాష మరియు అధ్యాపకులు అభినందించడం జరిగింది స్కూల్ హెచ్‌ఎం సితిప్పయ్య, మరియు ఆటల్లో ప్రధాన భాగంగా పాల్గొన్నటువంటి స్కూల్ పి ఈ టి ఇమ్రాన్ భాష మరియు అధ్యాపకులు అభినందించడం జరిగింది.



## మాజీ ఎమ్మెల్యే తనయుడు శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించిన మాజీ సీఎం



**తుగ్గలి ,మేజర్‌న్యూస్ :** పత్తికొండ మాజీ శాసన సభ్యులు తమ్మారెడ్డి తనయుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి బెంగళూరులో కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం ఫోన్లో పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి ధైర్యంగా ఉండాలని, ఏమైనా ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆయన ధైర్యం చెప్పారు. బెంగళూరులో తమ సహాయము కావాలంటే తమను కలవాలని జగన్ శ్రీనివాస్ రెడ్డికి భరోసా ఇవ్వడం జరిగింది. లండన్ పోవడంవల్ల సమయంకుదరదని ఆపరేషన్ అయిన తర్వాత తమను కలవాలని జగన్ శ్రీనివాస్ రెడ్డికి తెలియచేయడం జరిగింది.

## చిన్నతుంభళం గ్రామటిడిపి అధ్యక్షుడుగా నర్సింహులు



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని చిన్నతుంభళం గ్రామ టిడిపి అధ్యక్షులుగా బోయ నరసింహులు .గ్రామ జనరల్ సెక్రటరీ గా వీరేష్ గౌడ్. ఉపాధ్యక్షులుగా వెంకటేష్. ఆర్గనైజింగ్ సెక్రటరీ అయ్యన్న. పెద్ద ఎల్లప్ప. నాగేష్. కార్యదర్శిలు చెవులుకడబూరి. కటికెరసూల్.పెద్ద ఈరేష్ గుండాలి. చంద్ర మదిరిలను టిడిపి అధిష్టానం ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

## కోమాలోకి వెళ్లిన పాపను కాపాడిన కిమ్స్ కడల్స్ వైద్యులు



మాట్లాడుతున్న డాక్టర్ శ్వేత రాంపల్లి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కోమాలోకి వెళ్లిన 18నెలల పాపను కిమ్స్ కడల్స్ ఆసుపత్రి వైద్యులు కాపాడారు. శుక్రవారం కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ శ్వేత రాంపల్లి మాట్లాడుతూ పాప ఇక్కడకు వచ్చే సరికి కోమా పరిస్థితిలోకి వెళ్లిపోయిందని అయితే ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించి ఒక వారం రోజుల్లోనే పాప పరిస్థితిని మెరుగు పరిచామన్నారు. మామూలు జ్వరం, నీరసమే కదా అని వదిలేస్తే అది కోమా వరకు వెళ్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

## బాధితులకు సీఎం రీలీఫ్‌ఫండ్ కొండంత అండ - ఎంపీ శబరి



బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్న ఎంపీ శబరి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** ఆర్థిక ఇబ్బంది ఉన్నా ఆరోగ్యంతో బాధపడి ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని ఎంపీ డాక్టర్ శబరి అన్నారు. శుక్రవారం నంద్యాల బొమ్మలసత్రంలోని ఎంపీ కార్యాలయంలో ఆళ్ళగడ్డ మండలం బత్తలూరు గ్రామానికి చెందిన గజ్జల నాగశేషులుకు మంజూరైన రూ. 8.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుడికి ఎంపీ శబరి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనస్సున్న మారాజు అని, పేద రోగులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేసి అండగా నిలుస్తున్నారని అన్నారు. బాధితులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతగా ఉండాలని ఎంపీ కోరారు.

## చేర్ల కొత్తూరులో బేటీ పడావో.. బేటీ బచావో..

**-ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం ఉత్సవాలు -ఐసిడిఎస్ సిడిపిఓ లుక్..**



**వెల్దుర్తి ,మేజర్ న్యూస్:** వెల్దుర్తి సెక్టర్ -2 చెర్లకొత్తూరు గ్రామంలో పోషణ కార్యక్రమాన్ని శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఓ లుక్, సూపర్వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఓ లుక్ మాట్లాడుతూ ఉబకాయం అనేది శరీరంలో అధికంగా కొవ్వు పేరుకుపోవడం వల్ల ఏర్పడే ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య, ఇది గుండె జబ్బులు, మధుమేహం కొన్ని రకాల క్యాన్సర్లు రక్తపోటు శ్వాసకోష సమస్యలు ఏర్పడతాయన్నారు. ఉప్పు, చక్కెర తగ్గించి తగినంత మోతాదులో తీసుకోవాలని ఆయిల్ ఫుడ్ బయట ఫుడ్ తీసుకోకూడదని మన ఇంట్లో తయారు చేసుకున్నవి మాత్రమే తీసుకోవాలని అప్పుడే ఆరో గ్య సమస్య మెరుగుపడుతాయన్నారు. గర్భవతులు, బాలింతల తల్లులకు 1000 రోజుల కేరు గురించి తెలిపారు. సూపర్వైజర్ సరస్వతి మాట్లాడుతూ చిరుధాన్యాలు ,ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు చౌక ధరకు దొరికితే అందుబాటులో ఉండే వాటిని తీసుకోవాలని తెలిపారు.,భేటీపడావొ బేటిబచావో గురించి స్కూల్ టీచర్ సుధాకర్ మాట్లాడుతూ యువ తులను రక్షించడం ఆదుకోవడం విద్యను అందించడం అవగాహన పెంచడం వరకట్నం బాల్యవివాహాలు ఆడశిశుహత్యల గురించి తెలియజేశారు. విద్యార్థినీలకు ఆటల పోటీలు జరిపి బాలికలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను అందించారు. ఈ కార్యక్ర మంలో అంగనవాడి కార్యకర్త వరలక్ష్మి పి. మద్దమ్మ, పి. పద్మావతి, బి. మహేశ్వరి, డి. పద్మావతమ్మ, నాగమద్దమ్మ ,హెల్పర్స్ స్రవంతి,వెంకటేశ్వరమ్మ బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కమీషనర్ పై తిరుమల నగర్ కాలనీవాసులు ఆగ్రహం

**-రోడ్డు డ్రైనేజీ ఏర్పాటు చేయాలంటూ ఆందోళన**



కమీషనర్ కారును అడ్డగించిన కాలనీ వాసులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** ఇటీవల కురిసిన కుండ పోత వర్షాలకు ఎమ్మిగనూరు పట్టణంలోని తిరుమల నగర్ కాలనీ నీట మునిగింది. దీంతో ఆగ్రహించిన కాలనీ వాసులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు భైఠాయించి కమీషనర్ కారును అడ్డుకున్నారు. కార్యాలయంలో చోరబడి అధికారులతో వాగ్వివాదానికి దిగారు. తమ కాలనీలో రోడ్డు డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని,అందుకు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు రంగ ప్రవేశంతో వాగ్వివాదం సద్దుమణిగింది. కమీషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## అథ్లెటిక్ పోటీలను ప్రారంభించిన రమాకాంత్ రెడ్డి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల కేంద్రంలో స్థానిక ఎపిమోడల్ స్కూల్ నందు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం రాష్ట్ర టిడిపి రైతు విభాగం అధికార ప్రతినిధి నరవరమాకాంత రెడ్డి మండల విద్యాశాఖ అధికారి రామ్మూర్తి కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు సుమారుగా 200మంది పాల్గొనడం జరిగిందన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డివిజన్ స్థాయిలో కూడా పాల్గొని అక్కడ కూడా పాల్గొని విజేతలగా నిలిచి అక్కడ నుంచి జిల్లాస్థాయిలో పాల్గొని జిల్లాస్థాయిలో రాణించాలన్నారు. అంతేకాకుండా మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు పిలుపు నిచ్చారు. అదే విధంగా రాష్ట్ర. జాతీయ స్థాయిలో ఎంపికైన ఎవరైనా సరే అటువంటి విద్యార్థులకు తాను ఆర్థిక సహాయం కూడా చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామ్మూర్తి. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర. మండల కోఆర్డినేటర్ జెబి కృష్ణ. ఫిజికల్ డైరెక్టర్. స్వర్ణలత దుబ్బన్న .ఈరన్న. అయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీ శెనగలు పంపిణీ



సబ్సిడీ శెనగలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం సబ్సిడీ కింద శెనగలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆస్పరి మండలం అగ్రికల్చర్ కార్యాలయంలో ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ సంజన్న, మాజీ సర్పంచ్ వరదరాజులు, మాజీ మండల కన్వీనర్ తిమ్మన్న, తెలుగు యువత మండల అధ్యక్షుడు రాఘవేంద్ర యాదవ్, జనసేన మండల కన్వీనర్ అరవింద్, ఎం.డి. శ్రీనివాసులు, ఫోటో వీరేష్, వినోద్, రవి, నరేష్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు మేలు చేసే ప్రభుత్వం ఏదైనా ఉందంటే కూటమి ప్రభుత్వమన్నారు. దీపావళి కానుకగా అన్నదాత సుఖీభవ ఖాతాల్లో జమ, సబ్సిడీ నుంచి వచ్చే ప్రతి వస్తువును రైతులు వినియోగించుకోవాలని కూటమి నాయకులు తెలియజేశారు.

## వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ పోస్టర్ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న 17 మెడికల్ కాలేజ్ లను పిపిపి విధానన్ని రద్దు చేయాలని కోరుతూ పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి , రాష్ట్ర వైకాపా కార్యదర్శి కె. ప్రదీప్ కుమార్ రెడ్డి తన స్వగృహం లో కోటి సంతకాల సేకరణ పోస్టర్ ను నియోజకవర్గ వైకాపా నాయకులతో కలిసి శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర కమిటీ మెంబర్లు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గంలోని మండల జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్. ఎంపీపీలు, సర్పంచులు,జిల్లా కార్యవర్గ సభ్యులు,వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## బట్ట మేక పక్షిని సంరక్షించుకుందాం ఎమ్మెల్యే గిత్త

**హాజరైన పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత**

**మిడుతూరు మేజర్ న్యూస్:** బట్టమేక పక్షులు మన ప్రాంతంలో ఉండటం మన అదృష్టమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. మిడుతూరు మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామంలో బట్టమేక పక్షుల అభయారణ్యంలో శుక్రవారం ఉదయం సొసైటీ బస్టర్డ్ రికవరీ పోగ్రామ్ ప్రెసిడెంట్ మాంద్ర లింగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్టర్డ్ రికవరీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి,నందికొట్కూరు ఎమ్మెల్యే మరియు(బిఎన్ హెచ్ఎస్)బాంబే నేషనల్ హిస్టరీ సొసైటీ డైరెక్టర్ సుర్జీత్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూకొన్ని కారణాలవల్ల ఇక్కడ పక్షులు అంతరించిపోయాయని పక్షులను ఇక్కడ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రపంచ పటంలోనే మిదుతూరు మండలంలో నీ రోల్లపాడు గ్రామం ని చూస్తున్నామంటే మనకు గౌరవం అని పాణ్యం శాసన సభ్యురాలు గౌరు చరిత అన్నారు. దేశంలో గుజరాత్ రాజస్థాన్ మహారాష్ట్ర అంతేకాకుండా ఏపీలో ఇక్కడ ఉద్దటం మన అదృష్టం దీన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వస్తువుల్లోనూ పేదలకు మహిళలకు జీఎస్టీ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని జిఎస్టి ధరలను తగ్గించడంతో రాష్ట్రానికి 8 వేల కోట్ల నష్టం జరుగుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. ఈనెల 16వ తేదీన నన్నూరు రాగమయూరి దగ్గర జరిగే ప్రధాని బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆమె కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమం లో మాంద్ర లింగా రెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద రెడ్డి,టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

# అధ్వాన్న స్థితిలో పాఠశాల మరుగుదొడ్లు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరానికి సుమారు 10కి.మీల దూరంలో ఉన్న మిలిటరీ కాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మరుగుదొడ్ల పరిస్థితి అధ్వాన్న పరిస్థితిలో ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి రూ. కోట్లు వెచ్చించి "స్వచ్ఛ భారత్-స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛత హి సేవా" వంటి కార్యక్రమాల ద్వారా శుభ్రతపై ఎంతగానో దృష్టి పెడుతున్నప్పటికీ ఆ దృష్టి ఇక్కడి పాఠశాల ప్రాంగణం వరకు చేరినట్లు కనిపించడం లేదు. పాఠశాలలో 450కిపైగా విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు. అబ్బాయిల మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థలో కంపు కొడుతూ అసహ్యకర స్థితిలో ఉన్నాయి. బండలు విరిగిపోయి తలుపులు విరిగి, సిమెంట్ ఫ్లోర్లు, మూత్రం, చెత్తతో పాన్ పరాగ్ ఉమ్ము, చూస్తేనే జుగుప్స కరంగా ఉన్నాయి. అమ్మాయిల మరుగుదొడ్లు సైతం అలాగే ఉన్నాయి.


అద్వాన్నస్థితిలో మరుగుదొడ్లు

పాఠశాలలో బాలబాలికలు ఆ ప్రాంగణంలోని మైదానంలోనే భోజనాలు చేస్తున్నారు. ఈ క్రమం చూస్తే భయంకర వ్యాధులు వ్యాప్తి చెందడం ఖాయం అనిపిస్తుంది. ఇలాంటి స్థితిలో ఉన్న స్కూలు ఉపాధ్యాయులకు. హెడ్‌మాస్టర్‌కు ఇసుమంతైనా బాధ్యత కనిపించడం లేదు. పేరెంట్స్ కమిటీలు, విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. నాడు-నేడు పనుల కింద జరిగిన పనులను కాపాడుకోలేక వాటిని నిర్వహణ చేయలేకపోవడం పారిశుద్ధ్య కార్మికులను బాధ్యులు చేయాలనే ఆలోచనలు కనబడుతున్నాయి. ఎవరికి వారు మా బాధ్యత..నా.. అనే ఆలోచనలతోనే ఉన్నట్లు పూర్తి నిర్లక్ష్యం వీటిని చూస్తేనే తెలిపోతుంది.

**హెడ్‌మాస్టర్ వివరణ :** ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు దాతలు కట్టించినవి ఇక నాడు-నేడు నిధుల ద్వారా కట్టించినవి కూడా అక్కడే ఉన్నాయి. కొందరు బయటి వ్యక్తులు వచ్చి ధ్వంసం చేశారని, పిల్లలు పాన్‌పరాగ్‌లు వేసుకుని తిరుగుతున్నారని ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, రంజిత్ బాషా కలెక్టర్‌గా ఉన్నప్పుడు గూగుల్ షీట్‌లో కూడా తెలియజేశామని చెప్పారు. స్కావెంజర్ ఒక్కరే ఉన్నారు, శుభ్రంగా ఉంచుకోవాలని చూసుకోవాలని చెబుతున్నామని కావాలంటే స్కావెంజర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయండి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** భారతదేశ ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అధికారులను ఆదేశించారు. ప్రధాని మోడీ కర్నూలు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా మండలంలోని నన్నూరు టోల్‌గేట్ వద్దనున్న రాగమయూరి వద్ద పార్కింగ్, హెలిప్యాడ్, సభా ప్రాంగణం ఏర్పాట్లను కలెక్టర్ డా.ఏ సిరి, ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరపాండియన్, మంత్రి టీజీ భరత్, ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఐఏఎస్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కెఈ శ్యాంబాబు, దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇంచార్జ్ జ్యోతి, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మాట్లాడుతూ హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడ నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, శుభ్రత, తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన మండల స్థాయి క్రీడలు


పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** క్రీడల్లో పాల్గొనడం వల్ల మంచి ఆరోగ్యం లభించడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందవచ్చునని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల శాఖ కన్వీనర్ నరసింహులు ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహై స్కూల్ ఆవరణంలో శుక్రవారం ఆటల పోటీలను మండల అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ పోటీలో 14 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో జడ్పీహెచ్ స్కూల్ ఉయ్యాలవాడ, బాలికల విభాగంలో జడ్పీహెచ్ స్కూల్ హరివరం, 17 సంవత్సరాలలోపు విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ ఉయ్యాలవాడ, వాలీబాల్ పోటీల్లో ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్ ఉయ్యాలవాడ విద్యార్థుల జట్లు గెలుపొందినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ తెలిపారు. విజేతలకు అధికారులు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి-1 రఘురామిరెడ్డి, ఎంఈవో-2 వీర ప్రతాప్‌రెడ్డి, జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సరదాగా పార్కుకి వెళ్ళివస్తూ.. తిరిగిరాని లోకాలకు

**-ఆరేకల్లు గ్రామ సమీపంలో వెనుకనుంచి స్కూటీని వేగంగా ఢీకొట్టిన లారీ**

**-ఒకరు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం**

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** సరదాగా పిల్లలతో కలిసి ఆ దంపతులు పార్కులో ఎంతో సంతోషంగా గడిపారు. అయితే అంతే ఆనందంగా ఇంటికి బయలుదేరిన ఆ కుటుంబానికి తీవ్ర విషాదమే మిగిలింది. స్కూటీ వాహనంపై ఇంటికి తిరిగి వెళుతుండగా ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఆరేకల్లు గ్రామం బాలికల గురుకుల పాఠశాల దగ్గర శుక్రవారం సాయంత్రం ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పార్కుకి వెళ్ళి తిరుగు ప్రయాణంలో స్కూటీ వాహనంపై భార్యాభర్తలిద్దరూ కుమారుడుతో కలిసి ఆదోనికి వస్తుండగా.. ఏపీ02ఎక్స్ 6377 అనే నెంబర్ గల లారీ వేగంగా వెనుకనుంచి ఢీకొట్టడంతో తిరుపాల్ (45) అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య సుమలత, కుమారుడు విక్రాంత్ లు తీవ్ర గాయాలపాలయ్యారని ఆదోని రూరల్ ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడిది ఆదోని పట్టణం బీవీఆర్ ఎస్టేట్ కాలనీకి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఈ దంపతులు సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తమ కుమారుడితో కలిసి ఆరేకల్లు గ్రామం దగ్గర ఎమ్మిగనూరు జాతీయ రహదారిలో ఉన్న నగర వనం పార్కుకి వెళ్ళి తిరిగి ఆదోనికి వస్తుండగా (ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి వస్తున్న లారీ రూపంలో)ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఇంటికి చేరేలోపే తిరిగిరాని లోకానికి వెళ్లిన భర్తను చూసి ఆ ఇల్లాలు తల్లడిల్లిపోవడంతో బీవీఆర్ ఎస్టేట్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదానికి లారీ డ్రైవర్ అతివేగమే ప్రధాన కారణమని తెలుస్తోంది.


మృతుడు తిరుపాల్

# కుందూనదిలో మృతదేహం లభ్యం


లభించిన గుర్తుతెలియని మృతదేహం

**పాణ్యం, మేజర్ న్యూస్:** కుందునదిలో మృతదేహం లభించినట్లు ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తొగడ్చేడు గ్రామ శివార్లలో కుందునది బ్రిడ్జి కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. పోలీసులు అక్కడకు చేరుకొనిగ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పరిశీలించగా మృతుడి వయస్సు సుమారు 35 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చునన్నారు. మృతదేహం కుందునదిలో పడి 3 నుండి 5 రోజులు ఉండవచ్చు అన్నారు. మృతహద్దేహం ఎత్తు సుమారు 5. 5 అడుగులు ఉండవచ్చన్నారు. మృతుడి ఒంటిపై నీలం రంగు హాఫ్ టీ షర్టు, తెల్లని ఖద్బనీయను, నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు డ్రాయర్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహం శరీరమం తాపాలిపోయినట్టు తెలిపారు. మృతుడి గురించి ఎలాంటి సమాచారం తెలిసిన పాణ్యం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి సెల్ నంబర్9121101096 కి సమాచారం తెలుపవలెను అన్నారు.

# గ్యాస్ లీక్ ప్రమాదంలో వడ్డే నాగరాజు కోలుకోలేక మృతి

**-నిండు గర్భిణి సువర్ణ కడుపులో ఉన్న బిడ్డ మృతి -సువర్ణ చరణ్ పరిస్థితి విషమం..?**

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఎస్ .బోయనపల్లె గ్రామంలో గత సోమవారం ఒంటి గంట ప్రాంతంలో వడ్డే నాగరాజు ఇంట్లో గ్యాస్ లీకైన సంఘటనలో నలుగురు కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయ పడిన సంఘటన పాఠకులకు తెలిసిందే, క్షతగాత్రులు కర్నూల్ ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు, వడ్డె నాగరాజు 40 కోలుకోలేక శుక్రవారం మృతి చందడంతో భార్య పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుని భార్య సువర్ణ ఆరు నెలల నుండి గర్భిణీ గ్యాస్ మంటకు ఆమె కడుపులో ఉన్న బిడ్డ కూడా మృతి చెందడం బాధాకరం. భార్య సువర్ణ,చిన్న కుమారుడు చరణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పెద్ద కుమారుడు అనిల్ కొద్దిపాటి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. వీరు కర్నూల్ ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.

# ఎస్జీటీలకు మ్యానువల్ కౌన్సిలింగ్ పట్ల ఏపీటీఎఫ్ హర్షం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 రాష్ట్ర అధ్యక్షులు హృదయ రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి లు రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ప్రాతినిధ్యం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీలకు మ్యానువల్ కౌన్సిలింగ్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు కె. సాంబశివుడు, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. మాధవ స్వామి, నగరి శ్రీనివాసులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా లో 1600 లకు పైగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తున్నారని వెబ్ కౌన్సిలింగ్ లో చాలా ఇబ్బందులు ఉన్నాయని వీరికి మాన్యువల్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిందని అందుకు ప్రభుత్వము సానుకూలంగా స్పందించి మాన్యువల్ కౌన్సిలింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# జీతాలు పెంచి ఆదుకోండి



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండలంలో శుక్రవారం వీఆర్ఏలు జీతాలు పెంచాలని రెవెన్యూ అదికారులు జూనియర్ అసిస్టెంట్ నూర్జహాన్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లడుతూ విఆర్ఏలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని,డిఏ అవలెవెన్స్ ను జీతంలో కలపాలని, నామినీలను వీఆర్ఏలు గా గుర్తించాలని, వీఆర్ఓ,రికార్డు అసిస్టెంట్, నైట్ వాచ్మెన్,అటెండర్ తదితర పోస్టుల భర్తీలో 70శాతం వీఆర్ఏ లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** మండలంలో ప్రత్యేక స్టాల్ ద్వారా జీఎస్టీఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని పోలకల్ సచివాలయంలో శుక్రవారం సచివాలయ సెక్రెటరీ సునీల్ రాణి ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ వస్తువులపై తగ్గిన జీఎస్టీ వివరాలను తెలిపేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రాణెమ్మ పాల్గొని ఎలక్ట్రానిక్ మరియు ఎలక్ట్రికల్ వస్తువులపై గత ధరలను జివిస్టి శాతం తగ్గిన ధరల వ్యత్యాసలను ప్రజలకువివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్,సచివాలయ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల కేంద్రంలోని సచివాలయం-2లో ఎంపిడిఓ నూర్జహాన్ ఆధ్వర్యంలో జివిస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జివిస్టీ అధికారి నాయక్ మాట్లాడుతూ, జివిస్టీ తగ్గించడం వలన ఎలక్ట్రానిక్స్ వస్తువులైన టి.వి. ఫ్రీడ్జ్, ఏసి ఏయిర్ కూలర్ వాటిపై తగ్గించిన ధరలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్‌వైజర్లు వెలుగు కార్యాలయ సిసిలు,

# పిడుగుపాటుకు మహిళ మృతి


మృతురాలి (ఫైల్‌ఫోటో)

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండల పరిధిలోని గొడిగనూరు గ్రామానికి చెందిన ఇర్రి పోతుల సుమతి (30) పిడుగుపాటుతో మృతి చెందిందని కుటుంబీకులు ఇరిపోతుల ప్రమీల ఇరిపోతుల సల్మాన్లు తెలిపారు. కుటుంబీకుల వివరాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున, కాలకూత్యంలో కొరకు బైటికి వచ్చిందని, బలమైన ఉరుములు మెరుపులు వర్షంలో బలమైన ఉరుము శబ్దం రావడంతో ఇంట్లోకి వచ్చి కుప్పకూలి పోయింది. కుటుంబీకులు హుటాహుటిన సహవాస వైద్యశాలకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు అక్కడ వైద్యులు తెలిపారు. సునీతను పసలకొట్టాల పల్లె గ్రామానికి సందీప్‌కు ఇచ్చి వివాహం చేయడం జరిగిందని దసరా పండుగ నిమిత్తం అమ్మవారి ఇంట్లో అయినా గొడిగనూరుకు రావడం జరిగిందని వారు తెలిపారు. ఉరుము శబ్దంరూపంలో మృత్యుకంభలించిందని బోరునా విలపించారు. మృతురాలు సుమితకు ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. ఉరుము శబ్దంతో మరణించిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగిందని వారు తెలిపారు.

# పట్టణ సిఐటియు నూతన కమిటీ ఎన్నిక



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణ సిఐటియు నూతన కమిటీ ఆళ్లగడ్డ ఐదవ పట్టణ మహాసభ గ్రౌండ్ ఆవరణంలో జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు,సహాయ కార్యదర్శి బాల వెంకట్, తాళ్ల శ్రీనివాసులు ఈ మహాసభలకు నాయకత్వం వహించారు. గత మూడు సంవత్సరాల నుంచి పోరాటాలు జరిపిన కార్యక్రమాలపై మహాసభలకు హాజరైన అంగన్వాడి, మున్సిపాలిటీ, వైద్యరంగం,విద్యుత్ రంగం, కార్మికులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఆళ్లగడ్డ పట్టణ నూతన కమిటీ పట్టణ ప్రధాన కార్యదర్శిగాతాళ్ల శ్రీనివాసులు,అధ్యక్షులుగా రాజ్య లక్ష్మి, ఉపాధ్యక్షులు గా వెంకటయ్య, అశోక్,సుబ్బరాయుడు, నరసమ్మ, సహాయ కార్యదర్శులు గా సాల్మన్, సుధామణి, రత్నమయ్య లను ఎన్నుకోవడం జరిగింది. అలాగేకమిటీ సభ్య లుగా పెద్దక్క, లక్ష్మీదేవి స్టాఫ్ నర్స్, ఆరోగ్యమ్మ, భాగ్యమ్మ, సుబ్బరాయుడు, నాయుడు సెక్యూరిటీ వైద్యరంగం ఓబులేసు, శ్రీరాములు, లక్ష్మీ కుమారి లను ఎన్నుకోవడం జరిగింది.

## ఆళ్లగడ్డలో జీఎస్టీ పై అవగాహన కార్యక్రమం



**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వ్యాపారస్తులకు, ప్రజలకు గూడ్స్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ పై) మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ట్యాక్స్ అధికారి సునీత రెడ్డి పాల్గొని మాట్లాడుతూ..కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రజలపై జీఎస్టీ భారాన్ని తొలగించిందని, దీనివల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఎంత ఊరట లభించిందని వివరించారు. చాలావరకు ఎలక్ట్రానిక్ వస్తువులపై సేవా పన్నులను పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. దీనివల్ల చెరువు వ్యాపారస్తులకు మరింత వ్యాపారం మెరుగవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఇన్చార్జిబాలస్వామి,పొదుపు సంఘాలమహిళలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొనిఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత మాట్లాడుతూ మనసు బాగుండాలంటే నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగేవ్యాయామం చేయడం ,స్నేహితులతో గడపడం వల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు. టెన్షన్ పడకూడదన్నారు. ఎప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు.ప్యానల్ అడ్వకేట్ ఎన్ .సరిత, ఆసుపత్రి సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

## సంజామల నుంచి రాంకో ప్లాంటు వరకు ఎలక్ట్రికల్ లైన్ ప్రారంభం



**కొలిమిగుండ్ల మేజర్,న్యూస్ః**

సంజామల నుంచి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వరకు సుమారు 22 కిలోమీటర్ల మేర రైల్వే ఎలక్ట్రికల్ లైన్ ఛార్జ్ చేసే లైన్ శుక్రవారం కోవెలకుంట్ల ఎస్.ఎస్.ఈ టీ.ఆర్డీ వీరభద్రయ్య ప్రారంభించారు. ఈ ఎలక్ట్రికల్ లైన్ 25వేల వోల్టుల సామర్థ్యంతో సంజామల, కాణాల, మంగపల్లి, గిద్దలూరు, రెడ్డిపల్లె, రామిరెడ్డి పల్లె గ్రామాల మీదుగా రాంకో ఫ్యాక్టరీ వరకు నిర్మించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ రామరాజు, యూనిట్ హెడ్ మీనాక్షి సుందరం, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా పల్లె పండుగ కార్యక్రమాలు


భూమి పూజలో పాల్గొన్న అధికారులు, నాయకులు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీ, మండల కన్వీనర్ లింగస్వామి గౌడ్, మాజీ కన్వీనర్ నారపురెడ్డిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని గుమ్మడాపురం, శివపురం, కొత్తపల్లి గ్రామాలలో ఏపీవో విమలమ్మ ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఆయా గ్రామాలలో మంజూరైన షెడ్డు నిర్మాణానికి లబ్ధిదారులతో కలిసి కొబ్బరి కాయలు కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు గోకులం షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కోక్క గోకులం షెడ్డు నిర్మాణానికి కొలతలను బట్టి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ షెడ్ల వల్ల పశు సంరక్షణ కోసం రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. మండలంలో మంజూరైన గోకులం షెడ్లు వెంటనే పూర్తి చేపట్టినట్లైతే బిల్లులు మంజూరు చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను, పాడి పశువులను అభివృద్ధి చేసేందుకు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని కోరారు. సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, కో క్లష్టర్ అమర్‌నాథ్ యాదవ్, మాజీ మండల కన్వీనర్ వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, రవిశంకర్ యాదవ్, రామిరెడ్డి, నాగేశ్వరగౌడ్, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క విద్యార్థి క్రీడలను అలవాటు చేసుకోవాలి.. మాజీ జెడ్పీ ఛైర్మెన్ బత్తిన




**తుగ్గలి,మేజర్‌న్యూస్ :** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్క విద్యార్థి క్రీడలను అలవాటు చేసుకోవాలని కర్నూలు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ బత్తిన వెంకట రాముడు అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని రామలింగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు మాట్లాడుతూ క్రీడలలో రాణించిన విద్యార్థులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అవకాశాలను ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి ఒదన్నారు. అందుకు ప్రతి ఒక్క విద్యార్థి కచ్చితంగా క్రీ డలను అలవాటు చేసుకోవాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్ టిడిపి నాయకులు చెన్నంపల్లి కోటేశ్వర గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు చందు నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కూలు బస్సుకు తప్పిన పెను ప్రమాదం




**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి. బెలగల్ మండలంలో శుక్రవారం స్కూలు బస్సుకు పెను ప్రమాదం తప్పింది. మండలంలో గత ఏడాది నూతనంగా ప్రారంభించిన ప్రవేట్ స్కూలు అక్షర స్కూలు. ఈ స్కూలుకు మండలంలోని గ్రామాలతో పాటు పక్క మండలంలోని గ్రామాలు సోమలగూడూరు, పానకలదిన్నె,దైవందిన్నె గ్రామాలనుండి పిల్లలుబడి బస్సు ద్వారా రోజువచ్చి పోయే వారు. అందులో భాగంగా శుక్రవారం సాయంకాలం స్కూలు ముగించుకొని ఇంటికి వెళ్ళే క్రమంలో సరిగ్గా కంబదహాల్ గ్రామానికి అతి దగ్గరకు చేరుకోగానే బస్సు వెనక టైర్లు వుడి కుదుపులకు గురైంది. టైర్లు వుడిన బస్సు కొంతదూరం బస్సును లాక్కెళిందని,ఈ సమయంలో బస్సులో ఇంచుమించు 50మంది పిల్లలు ఉన్నారని కానీ ఎవరికి ఏమి కలేదని టైర్లు వుడిన ఘటనలో పెను ప్రమాదం తప్పిందని తల్లి దండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి అతివేగంమే కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రవేటు పాఠశాలల యాజ్యమన్యం కండిషన్ గల బస్సులను నడపాలని, కాలం చెల్లిన, పత్రములు లేని బస్సులను నడపరాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన డీఆర్ గవాయ్‌పై దాడి చేసిన మతోన్మాధిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కోవెలకుంట్లలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ఎం సుధాకర్, కరీం భాష, వడ్డె సుబ్బరాయుడు, ఓబులేసులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్న డీఆర్ గవాయ్ దళితుడనే భావనతోనే దాడి చేయడం జరిగిందని వారు తీవ్రం ఖండించారు. బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణ ఆదిపత్యంతో మతోన్మాధంతో ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. వెనుకబడిన కులాల వారు ఏ ఉన్నత స్థాయిలో ఉన్నా వివక్ష చూపుతున్నారని, స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పైబడినా భారత దేశంలో కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తికే ఇలా జరిగితే కిందిస్థాయిలో ఏవిధంగా దాడులు జరుగుతున్నాయో ప్రజలు గుర్తించాలని అన్నారు. ఈ దాడికి పాల్పడిన రాజేష్, కిషోర్‌లను కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో దేశ వ్యాప్త ఉద్యమాలు చేపట్టతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### నవంబరు 12న నాల్గవ స్నాతకోత్సవం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ ః**

రాయలసీమ విశ్వవిద్యాలయ నాల్గవ స్నాతకోత్సవం(కాన్వకేషన్) నవంబరు 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య వి వెంకట బసవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25కు వివిధ యుజి, పిజి, పిహెచ్‌డి, ప్రొఫెషనల్ కోర్సుల్లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 11నుండి 25వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాల్గవ స్నాతకోత్సవానికి సంబంధించి 4-9-2023, 16-5-2024తేదీల్లో యూనివర్సిటీ జారీ చేసిన ప్రకటనకు స్పందనగా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదని ఆయన వివరించారు.

## రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో నంద్యాల వాసికి 4 పతకాలు




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు లో జరిగిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో నంద్యాల వాసి కాశీపురం ప్రభాకర్ రెడ్డి నాలుగు పతకాలు సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున 50o కేటగిరీ లో ప్రాతినిధ్యం వహించిన ప్రభాకర్ రెడ్డి 25 మీ, 50 మీ బ్యాక్ స్ట్రోక్ లో మొదటి స్థానం.. 100 మీ మరియు 50 మీ ఫ్రీ స్టైల్ ఈవెంట్స్ లో రెండో స్థానంలో నిలిచారు. ప్రభాకర్ రెడ్డి తాను పాల్గొన్న నాలుగు ఈవెంట్స్ లోనూ పతకాలు సాధించడం విశేషం. నంద్యాల లో ప్రొఫెషనల్ స్విమ్మింగ్ పూల్ లేనప్పటికీ .. కేసి కెనాల్ లో రెగ్యులర్ గా ప్రాక్టీస్ చేసి ఈ ఘనత సాధించడం మరో విశేషం

# 16న పీఎం పర్యటనపై అధికారులతో సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైల పుణ్యక్షేత్రానికి విచ్చేస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటనలో ఎటువంటి లోపాలు లేకుండా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స హాల్‌లో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. పర్యటనకు సంబంధించి సున్నిపెంటలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రధానమంత్రి పర్యటించే ప్రదేశాల వరకు రహదారుల అభివృద్ధి, పారిశుధ్యం, లైటింగ్, పార్కింగ్ వంటి అన్ని అంశాల్లో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పర్యటన సమయంలో గ్రీన్ రూంలో ప్రధానమంత్రి కార్యాలయంలో లభించే సదుపాయాలు సమానంగా ఉండేలా పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలకు నిపుణులైన వైద్యుల బృందాలను నియమించి అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. భ్రమరాంబ గెస్ట్ హౌస్, దేవస్థాన పరిధిలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే పర్యట ప్రాంతం అంతటా పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టి శుభ్రతతో సుందరంగా తీర్చిదిద్దాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. పార్కింగ్ స్థలాలు, బారికేడింగ్, తాగునీటి సరఫరా, భద్రతా ఏర్పాట్లు, రవాణా సౌకర్యాల సమన్వయం వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పూర్తి చేయాలన్నారు. ప్రతి శాఖ నోడల్ అధికారిని నియమించి రోజువారీ పురోగతి నివేదిక సమర్పించాలన్నారు. శ్రీశైలం దేవస్థాన పవిత్రతకు తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ, అధికారులు


సమీక్ష సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ




నగరంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పర్యటన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16న ప్రధాని మోడీ కర్నూలు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా నన్నూరు టోల్‌గేట్ వద్దనున్న రాగమయూరిలో బహిరంగ సభ ప్రాంతాన్ని, కమాండ్ కంట్రోల్ రూంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన మంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరపాండియన్,కలెక్టర్ డా.ఏ సిరి, ఐఏఎస్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని, భద్రతపరంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. సాయంత్రం నగరంలోని ప్రధాన మార్గాల్లో వాహనాలు తనిఖీ, రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ప్రధాని పర్యటించే ప్రాంతాల చుట్టూ కర్నూలు పోలీసుల నిరంతరం నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## పేదవిద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రను ఎదుర్కొందాం..

**కోటి సంతకాల సేకరించి జగన్నన్న ఆశయం నెరవేరుద్దాం.. బుట్టా**



**ఎమ్మిగనూరు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని, జగనన్న పాలనలో రాష్ట్రానికి తీసుకువచ్చిన వైద్య కళాశాలలను పి పిపి పద్ధతిలో కూటమిపాలకులు ప్రైవేట్ పరం చేసే విధానాన్ని ఎదుర్కోనాలని కర్నూలు పార్లమెంట్ మాజీ సభ్యురాలు బుట్ట రేణుక వైకాపా శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయం ఆవరణలో కోటి సంతకాల సేకరణ గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 2019.. 2024 మధ్యకాలంలో రాష్ట్రానికి జగనన్న 17 మెడికల్ కాలేజీలు సాధించి తీసుకువచ్చిన తరుణంలో ఏడు కాలేజీల నిర్మాణాలను పూర్తి చేసి పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య విద్యను అందించడం జరిగిందని గుర్తు చేశారు. మరో 10 కాలేజీలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వాటికి కనీసం ఒక ప్రభుత్వం ఒక ఐదు వందల కోట్లు వచ్చిస్తే పేద విద్యార్థులకు ప్రభుత్వమే వైద్య విద్యను అందించే కాలేజీలు పూర్తవుతాయన్నారు. అలాంటి కాలేజీలను పి పి పి పద్ధతిలో ప్రైవేటుపరం చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలన్న కుట్రను పన్నుతున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన పని రాష్ట్రంలో యువతకు ఉందన్నారు. చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన పేదల పట్ల కనికరించిన పాలన కొనసాగించారని విమర్శించారు. జగనన్న ఆశయ సాధనలో రాష్ట్రానికి వచ్చిన 17 మెడికల్ కాలేజీ లను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలోని యువకుల పైన, వైకాపా పార్టీ నేతలు పైన ఉందన్నారు. చంద్రబాబు నాయుడు పేదలకు వైద్య విద్యను అందకుండా చేస్తున్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణలో వైయస్సార్సీపి పార్టీ కార్యకర్తలు నాయకులు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జగనన్న పాలన సాధించి పేద విద్యార్థులకు వైద్య కళాశాలలో అందించే బాధ్యతలలో పార్టీ నాయకులు కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం గోడ ప్రతులను విడుదల చేశారు వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బుట్ట నీలకంఠ, కేఆర్ మురారి రెడ్డి, ఎమ్మిగనూరు మండల పార్టీ అధ్యక్షులు బిఆర్ బసిరెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, మగతి సర్పంచ్ విరుపాక్షి రెడ్డి, కౌన్సిలర్లు కాసింబేగ్, నాగేశప్ప, శివప్రసాద్, వెంకటాపురం బజారి, వైసీపీ నాయకులు సునీల్, పాల శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

## నలుగురికి కారుణ్య నియామకాలు

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా ప్రజా పరిషత్తు యాజమాన్య పరిధిలో ఖాళీగా ఉన్న టైపిస్ట్ (జూ.ఆఫీస్ అసిస్టెంట్, కార్యాలయ సహాయకులు, ఆఫీసు సబ్ ఆర్డినేట్) పోస్టులకు అర్హత, అభీష్టము మేరకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించినట్లు జడ్‌పి సిఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి సర్వీస్‌లో ఉంటూ చనిపోతే ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తారన్నారు. ప్రభుత్వానికి, సమాజానికి సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. జడ్‌పి చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ సాధ్యమైనంత వరకు వారికి అనుకూలమైన ప్రదేశాలలో నియామకం చేశామన్నారు.



## వంకపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.50లక్షల ప్రతిపాదనలు

**– వంక రస్తాను అధికారుల పరిశీలన**




**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** వంకపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 50లక్షలు ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీ రాజ్ ఏఈ మల్లయ్య పేర్కొన్నారు. వంక దాటాలంటే నానా అవస్థలు పడాల్సిందే.. భారీ వర్షానికి కోతకు గురైన పొలాల దారి.. అనే శీర్షికను గురువారం ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. శుక్రవారం మంత్రాలయం మండల పరిధిలోని బూదురు గ్రామ వంకను రస్తాను పరిశీలించాలని సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాబును ఆదేశించారు. గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రస్తాను, కోతకు గురైన వంకను గుంతలు పడిన రస్తాను, ముళ్లకంపను పరిశీలించారు. దీనికి రూ. 50లక్షలు బ్రిడ్జి నిర్మాణానికి రస్తాకు ఖర్చు అవుతుందని అంఛనా వేసినట్లు తెలిపారు. ఆ నివేదికను జిల్లాలోని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఏఈ మల్లయ్య తెలిపారు.

## ప్రధాని సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం :- కలెక్టర్ డా.ఏ సిరి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఈ నెల 16న జరిగే ప్రధాని మోడీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ 16న ప్రధాని మోడీ బహిరంగ సభ 40ఎకరాలలో 3లక్షల మంది సమావేశంలో పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 347ఎకరాలలో 10వేల బస్సులు నిలుపుకునే విధంగా 12 పార్కింగ్ పాయింట్స్ ఏర్పాటు చేశామని, అన్ని పార్కింగ్ పాయింట్లు జాతీయ రహదారికి అనుసంధానం చేసే విధంగా అంతర్గత రహదారులు కూడా నిర్మించడం నేడు సాయంత్రానికి పూర్తవుతుందన్నారు. పబ్లిక్ మీటింగ్‌కు వచ్చిన ప్రజలందరికి 15లక్షల లీటర్ల తాగునీరు, మజ్జిగ, భోజనం, అవసరమైన వైద్య సదుపాయాలు, టాయిలెట్స్ ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు.

# వర్షానికి కూలిన మట్టి మిద్దె

**- ప్రమాదవశాత్తు నుంచి తప్పించుకున్న కుటుంబ సభ్యులు**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చిన్నతుంభళం గ్రామానికి చెందిన కురువ తిక్కయ్య అనే వ్యక్తి కి సంబంధించిన మటి మిద్దె కూలి పోయిందని భాదితుడు కురువ తిక్కయ్య శుక్రవారం విలేకరులకు తెలిపారు. అలాగే తమ కుటుంబ సభ్యులు కలిసి రాత్రి ఇంట్లోనే నిద్రిస్తున్న సమయంలో భారీ వర్షం కురువడం జరిగిందన్నారు. అయితే మట్టి మిద్దె కావడంతో వర్షాలకు మిద్దె కూలి పోయె లోగా తమకుటుంబంసభ్యులుకలసి ఒక్క సారిగా మేల్కొని తామంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు రావడం జరిగిందని అంతలోపే ఇంటిపై కప్పుపూర్తిగా కూలిపోయిందని వారు తెలిపారు.

## శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోండి –సీఐ జయరామ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సీఐ జయరామ్ సూచించారు. శుక్రవారం నెరవాడ గ్రామ సమీపంలోని కేశవరెడ్డి పాఠశాలలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరామ్ జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ ఆదేశాల మేరకు శక్తి టీమ్ బృందంచే శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ మ్యారేజ్, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ఫోక్సో చట్టాలు, లోన్ యాప్‌లపై వివరించారు. దూర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు వన్ స్టాఫ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలు జరిగితే 1930కి సమాచారం అందించాలని అన్నారు. అలాగే అత్యవసర పోలీస్ సేవలకు 112కు సహాయం కోరవచ్చునని సీఐ వివరించారు. అపరిచిత వీడియో కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ సిబ్బందిచే అమ్మాయిలకు సెల్ఫ్ డిఫెన్స్ నందు శిక్షణ ఇస్తామని అన్నారు. 10వ తరగతి పిల్లలకు శక్తి వారియర్స్ గ్రూప్ చేశారు.

# బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :**

బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడం చట్ట విరుద్ధమని ఉయ్యాలవాడ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మంజుల, మహిళా పోలీస్ మౌనిక పేర్కొన్నారు. రెండవ శుక్రవారం సందర్భంగా స్థానిక రెండవ అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిషోర బాలిక వికాశం అనే అంశంపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ మ్యారేజెస్ ప్రొహిబిషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధంగా బాల్య వివాహాలు చేయడం వల్ల తక్కువ నెలలు కలిగిన పిల్లలు లేదా నెలలు నిండకుండానే కాన్పుకావడం కారణంగా శిశువులు మరణించే అవకాశం ఉందని అన్నారు. బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నించే వారి సమాచారాన్ని మండల అధికారులకు ఇవ్వాలని అన్నారు. అలాగే చిన్నారులకు మొబైల్ ఫోన్లు అందుబాటులో లేకుండా చూడటం చాలా ముఖ్యమైన విషయమని అన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు గురు లక్ష్మి, ఫకూర్‌బీ, రాజేశ్వరమ్మ, ఫాతిమ్‌బీ, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.